అపరాజిత

గత నాలుగురోజుల్లోను జరిగిన సంఘటనలు, చెలరేగిన సంఘర్షణలు, సంక్షోభం రాజును పిచ్చివాణ్ణి చేశాయి. బీచిలో కూర్చుని యిసుకలో పిచ్చిగీతలు గీస్తూ పరిసరాలు మరచి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

రెండు రోజులనుండి ఆఫీసు ఎగ్గొట్టి రాజు చేస్తున్న పని కేవలం ఆలోచించడం. దేనిని గురించి ఆలోచిస్తున్నాడో, ఎందుకాలోచిస్తున్నాడో, పర్యవసానం ఏమిటో అతనికే ఇదమిత్థంగా తెలియదు. కన్ను మూసినప్పుడల్లా అతనికి కనిపించేది, తనలాంటి ఒడూ, పొడవూ ఉన్న మనిషి. చుట్టూతా తలలు విప్పి, బుసలు కొట్టే కింగ్ కోబ్రాల మల్లే సవాలక్ష ప్రశ్నలు.

ఒక ప్రశ్నకు తావిస్తే, ఆ ఒక్క ప్రశ్న జామెట్రికల్ ప్రోగ్రెషన్‌లో పెరిగిలక్ష ప్రశ్న అవుతుంది, కలరాక్రిమి మల్లే. మనిషి మరణాన్ని జయించగలడేమోగాని, తన్ను వేధించే ప్రశ్నలకు అతీతుడు కాలేడు. ఒక్కొక్క వ్యక్తి, తన జీవితకాలంలో సమాధానం సేకరించలేని ప్రశ్నలను తన తరంవారికి, మానవాళికి స్థిర చరాస్తులుగా వదిలిపెట్టి పోతూంటాడు.

రాజుకు అందరి మల్లేనే జీవితాశయం, జీవిత పరమావధి అంటూ ఏదీ లేదు. జీవితం మీదగాని, బ్రతుకుపైగాని ఎల్లాంటి దృక్పథం ఏర్పడలేదు.

వయస్సు గడుస్తున్నకొద్దీ జీవితానికి ఒక్కొక్కటి అవసరం అవుతాయి. ఈ అవసరాల సముపార్జనే మనిషి ఆశయం. ప్రపంచంలో సుస్థిరమైనది ఏదీ లేదు. మనిషి వయస్సుతోపాటు అతని ఆశయం ఆకారాన్ని మార్చుకుంటుంది. పరిణామాన్ని పొందుతుంది. యిదే రాజు తన తల్లి తండ్రుల నుండి తెలుసుకున్నది.

మనిషి పుట్టాడు. పుట్టాడు గనుక బ్రతుకుతున్నాడు. 'జాతస్య మరణం ధ్రువం' అంటూ మృత్యువును కౌగలించుకొని అనంత విశ్వంలోనికి ఎగిరిపోతున్నాడు. అతన్ని గుర్తుతెచ్చేవి అతని అస్థికలు, స్మృతులు. అస్థికలు కంటికి కనుపించని చోట్లలో దాగిపోతాయి. కాల ప్రవాహపు కదలికలో స[illegible] కరిగి, చెరిగిపోతాయి. చివరకు మిగిలేది ఏదీ లేదు.

జీవితపు యీ మూడు విభాగాలను ప్రధానంగా తీసుకుని 'ఎందుకు...ఏమిటి?' అని ప్రశ్నలు వేసే మనిషికి సుఖంలేదు. సృష్ట్యాది నుండి వచ్చే యీ ప్రశ్నావళికి సంతృప్తికరమైన సమాధానం దొరకదు.

బ్రతుకు గడుపుకొనే తాపత్రయంలో 'ఎందుకు?...ఏమిటి?' అన్న ప్రశ్నలు మరుపువస్తాయి. అప్రధానమైన అంశాలు ప్రధానమై, ఫండమెంటల్ కొశ్చన్సు మరుగున పడిపోతాయి. బండినిగతుకుల్లోంచి, ముళ్లకంచెల్లోంచి, గట్టు, పుట్ట మీదుగా లాక్కుపోవడం కర్తవ్యం అవుతుంది.

బండి మీద బరువు వెయ్యి!

బరువు మీద బరువు వెయ్యి!

లాగే ఎద్దును ఉక్కిరి బిక్కిరి చేసి, ఊపిరి సలపనివ్వకండా చెయ్యి!

ఇదే రాజు తండ్రి వెంకట్రామయ్య చేస్తున్న పని.

రాజుకు ఆరు సంవత్సరాల వయస్సు రాగానే అతన్ని చదుకోమన్నారు తల్లీ తండ్రీ. చదువెందుకో తెలియక పోయినా, రాజు వారు ప్రవేశపెట్టిన బడిలో చేరి చదువుకున్నాడు. అప్పుడతని లక్ష్యం చదవడం, పరీక్షలు ప్యాసు కావడం.

చదువు పూర్తయింది. 'ఉద్యోగం చూసుకో' అన్నారు తల్లిదండ్రులు. ఉద్యోగం సంపాదించడమే తన లక్ష్యంగా తీసుకుని, చెప్పులు అరిగిపోయేలా తిరిగి చివరకు ఉన్న ఊళ్లోనే నూటయాభై రూపాయల జీతం మీద రాజు ఉద్యోగం సంపాదించాడు.

'ఇహ పెళ్లి చేసుకో' అన్నారు అతని తల్లి తండ్రులు. ఇంతవరకు రాజు తన తల్లి తండ్రులు చెప్పిన వాటిని దేన్నీ కాదనలేదు. వారు చెప్పినది వేదవాక్యంలా తీసుకుని ఆచరణలో పెట్టాడు. ఇప్పుడు రాజు కొత్త ఆలోచించసాగాడు.

"పెళ్లెందుకు? పెళ్లి జీవితానికి ఏ విధంగా అవసరం? పెళ్లి చేసుకోకుండా మనిషి బ్రతకలేడా?"

యీ ప్రశ్నలకు సరియైన సమాధానం దొరకలేదు.

రాజు, అతని తండ్రి వెంకట్రామయ్య ప్రబల శత్రువుల మల్లే కనిపిస్తారు. ఇద్దరూ ఎప్పుడూ దూరదూరంగానే ఉంటారు. ఒకరినొకరు చూసుకోరు. మాట్లాడుకోరు. ప్రమాదవశాత్తూ ఒకరికొకరు ఎదురైతే వచ్చిన త్రోవనే పుచ్చుకుంటారు

యిద్దరూ. వీరిద్దరూ కలుసుకునేది రాత్రి భోజనాల దగ్గిర.

పెళ్లి విషయంలో రాజు కనపరుస్తున్న నిర్లిప్తత వెంకట్రామయ్యకు అర్థం కాలేదు. తండ్రీ కొడుకుల మధ్య రాయబారిణి సుందరమ్మకూడా రాజు అంతర్యమేమో తెలుసుకోలేకపోయింది. భర్త తరచి తరచి వేసిన ప్రశ్నలకు ఎల్లాంటి సమాధానం యివ్వలేకపోయింది సుందరమ్మ.

ఆ రాత్రి భోజనాల దగ్గిర వెంకట్రామయ్య తనంతట తానే యీ విషయం ప్రస్తావనకు తీసుకొచ్చాడు.

"నీకో అమ్మాయిని చూశానోయ్" అన్నాడు వెంకట్రామయ్య.

నములుతున్న అన్నం బుగ్గ క్రింద నొక్కి రాజు శ్రద్ధగా వింటున్నాడు.

"నీకు తెలిసే ఉంటుంది - లాయరు రాజేశ్వరం. పెద్దపేటలో ఉంటున్నాడు. వాడూ నేనూ చిన్ననాటి స్నేహితులం. సహాధ్యాయులం కూడా. అతగాడి రెండో కూతురు పిల్ల. మెట్రిక్ వరకూ చదివింది. వీణ వాయిస్తుంది. స్వరజతుల వరకూ నేర్పించిందిట. పాట భేషుగ్గా పాడుతుంది. వంటా వార్పూ వచ్చు. రంభా, ఊర్వశీ కాకపోయినా పిల్ల సంసారపక్షంగా బాగానే వుంది. నాకూ అమ్మకూ యీ సంబంధంఅన్ని విధాల నచ్చింది. మానిర్ణయమే నీ నిర్ణయమని రాజేశ్వరానికి మాట యిచ్చేశాను."

"అదేమిటండీ? పిల్లను వాడు చూచుకోనక్కర లేదా?" సుందరమ్మ ప్రశ్నించింది.

వెంకట్రామయ్య తలెత్తి సుందరమ్మ కళ్ల

అపరాజిత

లోనికి సూటిగా చూశాడు. అతని ముఖంలో ఎలాంటి భావం ద్యోతక మవటంలేదు.

"నిన్ను నేను మానే పెళ్లి చేసుకున్నానా ?"

సుందరమ్మ చిన్నగా నవ్వింది. "మీ మాట మరీబావుంది! ఆరోజులు వేరు. యీ రోజులువేరు. పిల్ల ఎంత అప్సరసైనా చేసుకోబోయేవాడు చూసుకోకుండా ఎట్లా?"

వెంకట్రామయ్య గట్టిగా నిట్టూర్చాడు.

సరే, రేపు వెళ్లండయితే. బుధ వారం, తిథివార నక్షత్రాలు బాగానే ఉన్నాయి. ఒరే రాజూ, రేపు పిల్లని వెళ్లి చూడు. అమ్మ కూడా నీతోవస్తుంది. యీ తంతేదో పూర్తయితే వచ్చే పదిహేనో తారీఖుకే పెళ్లి."

సుందరమ్మకు ముహూర్తం నిశ్చయం చేశారన్న సంగతి తెలియదు. విస్తుపోయి భర్తకేసి చూస్తూ బొమ్మలా ఉండిపోయింది.

రాజు శిలాప్రతిమలా చలనంలేకుండా కూర్చున్నాడు తల్లి పాదాలకేసి చూస్తూ. తండ్రిగా కొడుకు అభిప్రాయం తెలుసుకోకపోవటం అటుంచి, జీవితాన్ని గురించి ఆలోచించి ఒక నిర్ణయం చేసుకోగల సంతానాన్ని అదేసించడం, నిర్దేసించడం రాజుకు గర్హ్యంగా కనిపించాయి.

"యింకా పాతికేళ్లు నెత్తికి రాలేదే: పెళ్లి విషయంలో నాకులేని తొందర వీళ్ళకెందుకు?" కొడె త్రాచులాంటి ప్రశ్న రాజు ముందు సాక్షాత్కరించింది. తండ్రికి ఏం సమాధానం చెప్పాలో తెలియక, తన మనోభిప్రాయం ఏ విధంగా వ్యక్తం చెయ్యాలో తేలక క్షణం సతమత మయ్యాడు రాజు.

చివరకు తండ్రి భోజనం ముగించి చేయి కడుక్కునే వేళకు అన్నాడు.

"యిప్పుడు నా పెళ్లికేం తొందరలేదు."

చేయి కడుక్కునేందుకు మరచెంబు ఎత్తి వంచబోతున్న వెంకట్రామయ్య ఆగిపోయాడు. రెప్పవాల్చకుండా చూశాడాయన తలవంచుకుని అన్యమనస్కంగా భోజనం చేస్తున్న రాజుని.

"వయసులో ఉన్న వాడివి నీకు పెళ్లి తొందర లేకపోయినా, వయసులు మీరి, ఆరోగ్యాలు హరించిపోయిన మాదే ఆ తొందర. మీకు ఎప్పటికేది అవసరమో ఆలోచించి, మీజీవితాలు ఒక ఒడ్డుకు చేర్చడమే యిప్పటి మా కడ జీవితాల కర్తవ్యం. మా బాధ్యతలు సక్రమంగా నిర్వహించి సాధ్యమైనంత మేరకు సమస్యలకు దూరంగా వైదొలగి మా చివరి బ్రతుకులు గడుపుకోవాలనే మా నిశ్చయం."

రాజు తండ్రిని క్రీగంట చూశాడు. కనుబొమ్మలు ముడిచి సమాధానం కోసం నిరీక్షిస్తున్నట్లు రాజు కేసి తదేకంగా చూస్తున్నాడాయన. రాజు చటుక్కున తల దించాడు.

"నేను కొంతకాలం ఒంటరిగానే ఉండదలచాను.

వెంకట్రామయ్య గొంతులోని కటువుతనం కట్లు తెంచుకుంది.

"ఎంతకాలం ఒంటరిగా ఉండదలచావు? ఒకరోజా, నెలా సంవత్సరమా? ఎంతకాలం?"

జవాబు దొరక్క రాజు ముళ్లమీద కూర్చున్నట్లు బాధపడసాగాడు. కొడుకు సందిగ్ధావస్థకని పెట్టి వెంకట్రామయ్య టాకాయించాడు.

"ఏం? ఎంతకాలం బ్రహ్మచారిగా ఉంటావ్?"

రాజులో నిద్రాణంగా ఉన్న మొండితనం, పట్టుదల తొంగిమూశాయి. తండ్రి అంటే ఉన్నభయంపోయి కోపం మొలకెత్తింది. కలుపుకున్న మజ్జిగ అన్నం ముట్టనైనా ముట్టక బొడ బొడ నీళ్లుపోసి కంచంలో చెయ్యి కడుక్కుని లేచి పీటమీద నిలబడ్డాడు రాజు. అతనికళ్లు ఎరుపెక్కాయి, మాట తడబడి అస్పష్టమైంది.

"యిప్పుడు నాకు పెళ్లి అవసరమని తోచలేదు. నేను పెళ్లికి సుముఖంగా ఉన్నప్పుడు మీ బాధ్యత మీరు నిర్వహించి నా బాధ్యతలు యితోధికంగా పెంపు చెయ్యొచ్చు."

వెంకట్రామయ్యకు యీ జవాబుతో వెల్లువగా కోపమొచ్చింది. నిగ్రహించుకుందికి ప్రయత్నం చెయ్యలేదాయన.

'అయితే నీదేనా నిర్ణయం?"

రాజు మాట్లాడలేదు.

"ఊఁ. యింతవరకూ వచ్చావన్నమాట! మరేం. తొండముదిరి ఊసరవిల్లి అయింది. కనిపెంచినవాళ్లం మమతలు, మమకారాలు ఉంటాయిగాని, చేజేతులా నీ చేతుకోరి కాలకూట విషాన్ని తినిపించం. మా జీవితానుభవాలు వెనకేసుకుని చేసిన నిర్ణయం యిది. నిర్లక్ష్యం, ఉద్రేకాలు మనిషి సుఖపడేందుకు దోహదం చెయ్యవు. యీ రెంటికీ లొంగిపోయే వయస్సులు మావి. నీ అవివేకపు ఆలోచనలతో, నిర్ణయాలతో నీ జీవితం దుఃఖభాజనం చేసికొని, మాకడజీవితాలు కష్టపూరితం చేసే అధికారం నీకు లేదు. రాజేశ్వరం నా ఆప్తమిత్రుడు. డొక్కశుద్ధి, చిత్తశుద్ధి ఉన్న మనిషి. సంస్కారం సంప్రదాయం ఉన్న సంసారం అతనిది. నామాట కాదనవని అతనికి మాటయిచ్చాను. ఈ సంబంధం జరిగి తీరాలి. తల్లి తండ్రులని ఏమాత్రం గౌరవమున్నా నువ్వు మాకు ఎదురు చెప్పకుండా ఉండడమే నీ ధర్మం. రేపు పెళ్ళి చూపులకు మారుమాట్లాడక వెళ్ళు."

వెంకట్రామయ్య అదరా బాదరాగా చెయ్యి కడుక్కుని వెళ్లిపోయాడు. కళ్లనీళ్ల పర్యంతం అయి రాజు తన గదిలోనికి నడిచాడు.

నిముషాలు గడుస్తున్న కొద్దీ రాజులో జడత్వం ఎక్కువైంది. ఏ కారణం చేతనో ఒంటరిగానే, సాధ్యమైతే జీవితాంతం బ్రహ్మచారిగానే ఉండిపోవాలన్న పట్టుదల అతనిలో ఘనీభవించింది.

మర్నాడు సాయంత్రం వేళకు సుందరమ్మ కొడుకును బలవంతంగా పెళ్లి చూపులకు తీసుకువెళ్లింది. రాజు దృష్టి ఎటుందో తల్లికి తెలియలేదు. పిల్లను చూడలేదేమో అన్న అనుమానం పీకుతూనే సుందరమ్మ యింటికి తిరిగి వచ్చింది.

"పిల్లను చూశావా? నచ్చిందా?" అని సుందరమ్మ పదేపదే వేసినప్రశ్నలకు రాజు సమాధానం యివ్వలేదు. బండరాయి మల్లే ఉలుకూ పలుకూ లేక వాలుకుర్చీలో కూర్చున్నాడు; కిటికీ చువ్వలగుండా శూన్యంలోకి చూస్తూ.

ఆరాత్రి తండ్రికంటె ముందుగానే భోజనంచేసి రాజు తనగదిలో కూర్చున్నాడు. వెంకట్రామయ్య సుందరమ్మ ముఖంచూసి విషయం గ్రహించి రాజు గదిలోనికి నేరుగా వెళ్ళాడు. తండ్రిరాక గమనించి కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు రాజు.

"పిల్లను చూశావా?"

రాజు చూశానని తలూపాడు.

"పిల్ల నచ్చిందా?"

రాజు ప్రత్యుత్తర మివ్వలేదు. వెంకట్రామయ్య రెండోసారి ప్రశ్నించాడు.

"నచ్చలేదు"

రాజు జవాబు వెంకట్రామయ్యను ఏవిధంగానూ ఆశ్చర్యపరచలేదు.

'ఎందుకు నచ్చలేదు? పిల్లలో ఏంలోటు"

"నాకు తెలియదు"

"అయితే నీకు తెలిసిందేమిటి? పిల్ల నచ్చకపోవటం అంతేనా? నీతత్త్వం నాకర్థంకాక పోలేదు. పెళ్లి జరక్కుండా ఉండేందుకు నువ్వు వేస్తున్న ఎత్తులివి. వీటికి సమాధానం ఏవిధంగా చెప్పాలో నాకు తెలుసు" వెంక

పెద్దమనిషి—ఏమండి, 'ఆదివారం సెలవు' అని బోర్డు తగిలించి దుకాణం తెరిచారేమండీ?

దుకాణం యజమాని—సెలవు ప్రజలకుగాని దుకాణానికి కాదండి.

ఆల్‌ఫ్రెడ్ జాన్‌సుందరం (అనంతపురం)

ట్రామయ్య పెల్లుబికివచ్చే కోపాన్ని దిగమింగుతూ వెళ్లిపోయాడు.

ఆ రాత్రి కొడుకు పెళ్లి విషయంలో భార్యాభర్తలకు మాటా మాటా పెరిగాయి. రాజును సమర్థించబోయిన సుందరమ్మ వెంకట్రామయ్య కోపానికి గురి అయింది. తల్లి పడేతిట్లు విని రాజు విపరీతంగా బాధపడ్డాడు. తండ్రి అంతర్యం తెలియక ఆరోజునుండి నిద్రకు దూరమై పోయాడు రాజు.

ఆ వేళనుండి వెంకట్రామయ్యసుందరమ్మల మధ్య మాటలులేవు. యిద్దరిమధ్యా అగాధ మేర్పడి ఎడముఖం పెడముఖంగా తయారయ్యారు. సుందరమ్మ రాజుతోకూడా పూర్వంలా ఉండడంలేదు. యిద్దరిమధ్యా మాటలు అవసరాన్నిబట్టి ముక్తసరిగా జరుగుతున్నాయి. ఇల్లు నీరసమైంది. శాంతికి దూరమైంది.

యీస్థితి నాలుగురోజులు వైదొలగకండా ఉండిపోయింది.

యింట్లో, మనసుల్లో చెలరేగిన అశాంతిని భరించలేక తన నిర్ణయాన్ని మార్చుకుందికి ప్రయత్నించాడు రాజు. కాని తండ్రి వైఖరి అనుచితంగా, క్రూరంగా కనిపించింది. తండ్రి అన్న మాటలకు అభిమానం దెబ్బతిని సంతత ధారాపాతంగా ఏడుస్తూ కుమిలిపోతున్న తల్లి దీనవదనం రాజుకు తండ్రిపై గల గౌరవ భావాన్ని పూడ్చి, అతని పట్టుదలను ద్విగుణీకృతం చేసింది తాబేలులా ముడుచుకుపోయాడు రాజు.

చీకటి పడుతోంది. వీధి దీపాలు వెలిగాయి. దివి వెలిగే చంద్రునికి కిలకిలా నవ్వే నక్షత్రాలకుస్వాగతం పాడుతూ, యినుమడించిన ఉత్సాహంతో చెయ్యెత్తు కెరటాలు విసుర్తోంది సముద్రం.

రాజు సిగరెట్ ముట్టించి ఆరిన అగ్గిపుల్ల పారెయ్యబోతూ, దాపున వినబడే గాజుల సవ్వడి విని ఆగి, చప్పుడు వినబడే దిక్కు తల తిప్పి చూశాడు. ఎవరో అమ్మాయి. పదునెనిమిదేళ్ల పడుచు అతనికేసే చూస్తోంది దాపున కూర్చుని. రాజు గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఆమెకేసి పరీక్షగా చూశాడు. చొరవగా ఆమె నమస్కారం చేసి చిన్నగా నవ్వింది. రాజు ఉక్కిరిబిక్కిరయ్యాడు. చీకటికి అలవాటుపడ్డ కళ్ళు వెలుగు చూడగానే గ్రుడ్డి అయినట్లు రాజు కళ్లు బైర్లు కమ్మాయి.

"క్షమించాలి! మీరెవరో ... నాకు తెలియదు" వయసులో వున్న వాడికత్తితో మాట్లాడ్డం రాజుకది మొదటిసారి.

"అబద్ధం ఆడుతున్నారు" ఆమె నవ్వుతూ అంది.

"యధార్థం అది."

"అదే నిజమైతే మిమ్మల్ని మీరు తెలుసుకునే స్థితిలో లేరని నేననుకోవాలి. నేను రాజేశ్వరంగారి అమ్మాయిని. నా పేరు జ్యోతి."



"నాకు తెలీదమ్మా! ఒకవేళ నాన్నేమన్నా పావలాను గణపతి బొడ్డులోంచి తన బొడ్డులోకి దోపుకున్నాడేమో చూడు!!

చిత్రకారుడు: నాగరాజ (పొద్దుటూరు)

రాజు త్రుళ్లిపడ్డాడు. ఆమెనే తను పెళ్లి చూపులు చూసేందుకని వెళ్లినది

"వెన్నెల్లో మిల మిలా మెరిసిపోతూ ఎంత అందంగా వుంది! యీమే నా భావికి జ్యోతి! ఒంటరిగా వచ్చినట్లుంది? ఎంత సేపటినుండి యిక్కడ కూర్చుంది? ఏం చేస్తోంది? కావాలని యిక్కడవచ్చి కూర్చుందా? ఉరుములేని పిడుగులా యీ రాకేమిటి? సిగ్గుపడటంలేదు? చాలా చనువుగా మాట్లాడుతోంది! గొంతు ఎంత మధురంగా ఉంది!" రాజు మేనస్సులో యిలాంటి ప్రశ్నలు, ఆశ్చర్యార్థకాలు వందలుగా మెరిశాయి. ఆ క్షణమే మరుగుపడిపోయాయి.

"మన్నించండి...చీకట్లో..."

"వెన్నెల వుంది?" జ్యోతి వినిపించేటట్లు నవ్వింది.

రాజు సిగ్గుతో ముడుచుకుపోయాడు.

"మీరు అపార్థంచేసుకోరంటే ఒకటడుగుతాను సమాధానం చెప్తారా?" జ్యోతి దిక్కులు చూస్తూ ప్రశ్నించింది.

"తప్పకుండా."

"మొన్న మీరు పెళ్లి చూపులకని వచ్చారు. నచ్చలేదని.. అన్నారని విన్నాను. నాలోని లోపం దయచేసి చెప్తారా?" జ్యోతి గొంతు అభిమానంతో, స్వాతిశయంతో, కోపంతో గద్గదం అయింది. ఆమె కన్నులనుండి వేడి కన్నీటిబొట్లు క్రిందకు జారిపడ్డాయి.

రాజు ఆమె ప్రశ్న విని గాలిలో పల్టీలు కొట్టాడు. పటాపంచలైన స్థిమితాన్ని కూడదీసుకుని బిడియపడుతూ, తన్ను తాను చీదరించుకుంటూ అన్నాడు

"మీరెక్కడ విన్నారో గాని అది శుద్ధాబద్ధం."

జ్యోతి కిలకిల నవ్వింది. మరుక్షణంలో ఆమె ముఖంలోని నవ్వు మాయమై గంభీరమైంది.

"నేను మిమ్మల్ని యిట్లా నిలవదీసి అడుగుతున్నందుకు మన్నించండి. మీ అభిప్రాయం తెలియకముందే నేను మిమ్మల్ని నచ్చలేదని అని, ఆ కబురు మీరు వింటే మీ మనోభావాలు ఎట్లా వుంటాయి?"

యీ ప్రశ్నతో రాజుకు ముచ్చెమటలు పోశాయి. తన్నెవరో క్రిందపడదోసి కుమ్ముతున్నట్లు బాధపడసాగాడు. అప్రయత్నంగా అతని కన్నులు చెమ్మగిల్లాయి.

"మీ భావం నాకు అవగతం కాకపోలేదు. యీరోజుల్లో పెళ్లిళ్లు బాహ్యసౌందర్యాన్ని, అలంకారాన్ని బట్టి జరుగుతున్నాయిగాని వ్యక్తి సంస్కారాన్ని, హృదయసౌందర్యాన్ని పరికించి కాదు. మనిషిని అర్థం చేసుకునేందుకు కలయిక అవసరం. అది పాశ్చాత్యదేశాల్లో సాధ్యంకాని, యీ పవిత్ర భారతదేశంలో దుస్సాధ్యం. ఈ విషయంలో అలాటి నిర్ణయానికి నేను రాలేను. కౌగలించుకోబోయే కాంతిపుంజాన్ని బైటికి నెట్టి చీకటిలో ముడుచుకుపోయే మనిషిని కాదు. పుత్తడి బొమ్మలా వున్న మిమ్మల్ని కాదని ఆత్మవంచన చేసుకోలేను."

"అతిశయోక్తుల్లో మాట్లాడుతున్నారు?"

"నిజం చెప్పాను. మీరు గ్రహించినా, కాదన్నా నా నిర్ణయం ఒక్కటే!"

"ఏమిటో ఆ నిర్ణయం?" జ్యోతి చీర చెంగులో ముఖం దాచుకుని ప్రశ్నించింది.

రాజు నవ్వకుండా ఉండలేకపోయాడు.

"మీ హృదయారామంలో కొత్త చోటు యివ్వమని అర్థించడమే.."

జ్యోతి సిగ్గుపడుతూ అన్నది "నా హృదయం ఎవరో దొంగిలించారు!" అని ఉబికివచ్చే నవ్వును అతికష్టంమీద దిగమ్రింగుతుంది జ్యోతి.

"ఎవరో ఆ దొంగ?" రాజు ఆమె కళ్లలోకి చూస్తూ ప్రశ్నించాడు.

"ఆ రాజు నడగండి" జ్యోతి చంద్రుని వంక చూపించి, నవ్వుతూ లేచి సెలవు పుచ్చుకుని వెళ్లిపోయింది.

దిగులు పటాపంచలై, రాజు ఆడుతూ, పాడుతూ యిల్లు జేరుకున్నాడు. వంటింట్లోవున్న తల్లి దగ్గరకు నేరుగాపోయి ఆమె చెవిలో ఏవో చెప్పాడు.

అపరాజిత

సుందరమ్మ నవ్వుతూ "అమ్మ దొంగ భడవా!" అని రాజు బుగ్గమీద చరిచింది.

రాజూ, జ్యోతుల వివాహం అనుకున్నట్లుగా వెంకట్రామయ్య నిశ్చయించిన ముహూర్తానికే అయింది.

యీనాళ్ల నాటివిందులో వెంకట్రామయ్య వియ్యంకుడు రాజేశ్వరంతో అన్నాడు.

"యీ రోజుల్లో కుర్రాళ్లు తమకు ఎదురు చెప్పేశక్తి లేదని, తాము చేసుకున్న నిర్ణయాలే గొప్పవని భ్రమలోవుంటారు తల్లిదండ్రులపైనున్న గౌరవం, భక్తిపోయి వారికే ఎదురు తిరుగుతారు. కాని వీళ్లను పిడికిల్లో బిగించి ఊపిరి సలపనివ్వకుండాచేసే శక్తి ఉందని, ఆ శక్తిముందు మహా సామ్రాజ్యాలే మంట గలిశాయని, ధీరులు, ధీమంతులు బానిసలై తలలు వంచారని, పాపం! యీ కుర్రకారుకి తెలియదు."

సరసనే కూర్చుని విందు భోజనం చేస్తున్న జ్యోతి మామగార్లతోపాటు నవ్వింది.

"పెళ్లి పెడాకులు చేసుకోక ఘోటక బ్రహ్మచారిలా వుంటానన్న వాడి ముక్కుకి తాడు కట్టి దారిలోకి తీసుకొచ్చావ్. మరి నాలుగు లడ్డూలు తిను" సుందరమ్మ కోడలు వద్దంటున్నా పళ్లెంలోని లడ్డుండలు ఆమె విస్తరిలో పడేసిపోయింది.

రాజు విస్తుపోయి నవ్వే జ్యోతికేసి చూస్తూ ఉండిపోయాడు. అతని సందేహాలు సారె గదిలో గాని తీరలేదు. ★